క్లుప్తంగా

చెక్కుల పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సిఫార్సులతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రూ. 34,67,000ల విలువ గల 106 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రభుత్వం అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారి విషయంలో కూడా గత ప్రభుత్వం మాదిరి కాకుండా కోతలు విధిస్తూ వివక్షత చూపుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, నాయకులు పొట్ల శ్రీను, వరప్రసాద్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

మెళకువలు పాటించాలి

కామేపల్లి: నాటు వేసే విధానంలో రైతులు మెళకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు వేస్తున్న క్రమంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలని, నారు కొసలు తుంచి నాటు పెట్టుకోవాలని సూచించారు. కలుపు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

కేంద్రమంత్రిని కలిసిన 'కుమిలి'

ఖమ్మం అర్బన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆ పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు హైదరాబాద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలోని నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ తీరు తదితర అంశాలపై మాట్లాడినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

దేవాలయంలో సౌందర్య లహరి పారాయణం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వైద్యనాథ స్వామి దేవాలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా మహిళా భక్తులు సౌందర్య లహరి పారాయణం చేశారు. గ్రామ శివారులో కొలువై ఉన్న దేవాలయంలో మహిళా భక్తులు అత్యధికంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎస్సైకు సన్మానం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం ఎస్సైగా విధులు నిర్వర్తించి బదిలీ అయిన గిరిధర్‌రెడ్డిని మంగళవారం పోలీస్ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బదిలీపై ఎక్కడికి వెళ్లినా తనకు వెన్నుదన్నుగా నిలిచిన ప్రతి ఒక్కరినీ గుర్తుంచుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రాఘవయ్య, కానిస్టేబుళ్లు హరికృష్ణ, వెంకన్న, పున్నయ్య, వీరస్వామి, ఉప్పలయ్య, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి..

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీలో ఖమ్మం డిపో పరిధిలో ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందిని ఆర్ఎం సరిరామ్ సత్కరించి, అభినందించారు. మంగళవారం ఖమ్మం డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత డిప్యూటీ రీజినల్ మేనేజర్ జీఎస్ పవిత్ర, ఖమ్మం డీఎం దినేష్‌కుమార్‌లతో కలిసి ఆర్ఎం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు, సిబ్బందికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం సరిరామ్ మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధిలో సిబ్బంది పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) రామయ్య, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11కేవీ ఎన్నెస్పీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ గట్టయ్య సెంటర్ ఫీడర్‌లో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-3 ఏఈ బి.తావుర్యా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో గట్టయ్యసెంటర్, నూతన మున్సిపల్ కార్యాలయ ప్రాంతం, ఎంఎల్ పార్టీ కార్యాలయం ఏరియా, బైపాస్ రోడ్, ద్వారకానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోత విధించబడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వెంటనే వైద్య శిబిరాలను నిర్వహించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్‌సింగ్ అన్నారు. మంగళవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారై జ్వరాలు వ్యాపిస్తున్నాయన్నారు. పారిశుద్ధ్యం మెరుగు పరుస్తూ, వ్యాధులను అరికట్టేందుకు గ్రామాల్లో వీధులన్నింటిని శుభ్రం చేయించి బ్లీచింగ్ విరివిగా చల్లించాలన్నారు. ఆయా సంఘాల నాయకులు ఆవుల మంగతాయి, ఎస్.వి.రాకేష్, గోకినేపల్లి లలిత, ఝాన్సీ, శోభ, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

వారి త్యాగాలు అజరామరం

జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సభల్లో వక్తలు

ప్రత్యేక తెలంగాణ సాధన కోసం తమ జీవితాలను ప్రజలకు అంకితం చేసిన అమరవీరుల త్యాగాలు అజరామరం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారథి, తెలంగాణ ప్రజాకవి, ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతితో పాటు తెలంగాణ సృష్టికర్త, తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్, జయశంకర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈమేరకు గద్దర్ విగ్రహాన్ని ఖమ్మం ట్యాంక్ బండ్‌పై పెట్టాలని, పాఠ్యపుస్తకాల్లో జయశంకర్ చరిత్రను చేర్చాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంగాంధీచౌక్: గద్దర్‌కు నివాళులర్పిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు


ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో.. పార్టీ నాయకుల నివాళి


ఖమ్మం మామిళ్లగూడెం: అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలంగాణ ఉద్యకారుల ఫోరం బాధ్యులు


ఖమ్మం సహకారనగర్: జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీఎన్జీఓస్ నాయకులు


ఖమ్మం లీగల్: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


ఖమ్మంక్రైం: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జయశంకర్ జయంతి వేడుకలు


ఖమ్మం మామిళ్లగూడెం: వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో..


ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో.. నివాళులర్పిస్తున్న వైద్యులు, అధికారులు


ఖమ్మంమయూరిసెంటర్: అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


తిరుమలాయపాలెం: తహసీల్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


ఖమ్మంగాంధీచౌక్: జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దేవాదాయ శాఖ ఉద్యోగులు

ఉత్తమ సేవలతో చిరకాల గుర్తింపు

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి: ఉపాధ్యాయులు ఉత్తమ సేవలు అందించి విద్యార్థుల మనస్సులో చిరకాలం నిలవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఖమ్మం రూరల్ మండలం పెద్దవెంకటగిరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు గోకినపల్లి నాగమణిని సన్మానించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 11ఏళ్ల పాటు నేలకొండపల్లి మండల గువ్వలగూడెం గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిగా విశిష్ట సేవలు అందించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి మెలిసి విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలో వారి అనుభవాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సన్మానంలో డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓలు పాల్గొన్నారు.


నాగమణికి జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన డీఈఓ, తదితరులు

డ్రెయినేజీ సమస్యను త్వరగా పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: మరమ్మతులకు గురైన డ్రెయినేజీలను పునర్ నిర్మించి, సమస్యను తక్షణమే పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. నగరంలోని 25వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ గోళ్ల చంద్రకళవెంకట్ వినతి మేరకు కమిషనర్ డివిజన్‌లోని పాత మున్సిపల్ నుంచి గాంధీపార్క్‌కు వెళ్లే రోడ్డులో డ్రెయినేజీలు, అంతర్గత రోడ్లను పరిశీలించారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీల నిర్మాణాలకు అంచనాలు తయారు చేసి కొత్త నిర్మాణం చేపట్టాలని, అప్పటివరకు కాల్వల్లో చెత్తచెదారం నిల్వ ఉండకుండా చూడాలని శానిటరీ వర్కర్లకు సూచించారు. అలాగే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నగరంలోని బైపాస్‌రోడ్డు, ఎన్ఎస్‌పీ గెస్ట్ హౌజ్ వాటర్ ట్యాంక్‌లతో పాటు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్‌ను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. ట్యాంకుల్లో నీటి నమూనాలను సేకరించి నీటి పరీక్షలు చేశారు. ట్యాంక్‌లు శుభ్రం చేసే సమయంలో సిబ్బంది తీసుకుంటున్న రక్షణ చర్యలుఅధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటిని శుభ్రపరిచే సమయంలో క్లోరిన్‌ను మోతాదుకు మించి వాడరాదని, బ్లీచింగ్ కూడా మించకుండా చూడాలని ఆదేశించారు. పైపు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, మున్సిపల్ ఈఈ ఎ.సంపత్‌కుమార్, వాటర్ సప్లై సిబ్బంది, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలిస్తున్న కమిషనర్

నాగార్జున సాగర్ నీళ్లతో చెరువులన్నీ నింపాలి

ఖమ్మంమయూరిసెంటర్: నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు పూర్తిస్థాయిలో నీళ్లను వెంటనే విడుదల చేసి 550 చెరువులను పూర్తిగా నింపాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు కృష్ణా నదిపై ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యాంలు పూర్తిగా నిండినప్పటికీ సాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీళ్లను పూర్తిస్థాయిలో వదలకుండా నదిలోకి వదిలి సముద్ర పాలు చేయడం అంటే ప్రభుత్వ నిర్లక్ష్యమా, అధికారుల బాధ్యతారాహిత్యమా అని ప్రశ్నించారు. వర్షాలు పడుతున్నప్పటికీ సాగర్ ఆయకట్టు ప్రాంతంలో చెరువులు నింపలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం నీటి వాటాలు తేల్చకుండా, వివాదాలు పరిష్కారం కాకుండా రాజకీయ దుర్బుద్ధితో తెలుగు రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీస్తుందన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో నీళ్లను విడుదల చేసి చెరువులన్నీ నింపాలని డిమాండ్ చేశారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోండి..

- 300 చదరపు గజాల ఆవరణల్లో తప్పనిసరి
- నోటీసులు జారీ చేస్తున్న కేఎంసీ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 300 చదరపు గజాల పైబడి స్థలంలో చేపట్టిన నిర్మాణాల ఆవరణలో ఇంకుడు గుంతలను తప్పనిసరి చేస్తూ కేఎంసీ అధికారులు నిర్ణయించారు. ఈమేరకు ప్రభుత్వ కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, థియేటర్లు, ఫంక్షన్ హాళ్లు, ఆస్పత్రులే కాక నివాస గృహాల్లో నిర్మించుకోవాలని నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసు అందిన వారంలోగా ఇంకుడు గుంత నిర్మించి ఫొటోను కేఎంసీ అధికారులకు సమర్పించాలని.. లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

వాన నీటిని ఒడిసి పట్టేలా..

నగరంలో వర్షం కురిసినప్పుడు నీరంతా కాల్వల ద్వారా వృథాగా పోతోంది. నానాటికీ పెరుగుతున్న కాంక్రీట్ నిర్మాణాలతో కొద్దిమేర కూడా నీటిని కూడా నిల్వ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యాన ప్రభుత్వ సూచనలతో ఖమ్మం నగరంలో ఇంకుడు గుంతలు నిర్మించి వర్షపునీటిని ఒడిసిపట్టాలని అధికారులు సంకల్పించారు. ఇందులో భాగంగా 300 చదరపు గజాలకు పైగా స్థలంలో చేపట్టిన నిర్మాణాల్లో ఇంకుడుగుంతలను తప్పనిసరి చేస్తూ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ నోటీసుల్లోనే నిర్మాణానికి సూచనలు ఇస్తుండగా.. నగరంలో సుమారు వెయ్యికి పైగా ఇంకుడు గుంతలు తీయించాలని నిర్ణయించారు.


51వ డివిజన్‌లో నోటీసులు జారీ చేస్తున్న సిబ్బంది, కార్పొరేటర్ రమా వీరభద్రం

స్నేహితుడి కుటుంబానికి చేయూత


ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

ఖమ్మంరూరల్: మండలంలోని దానవాయిగూడెంకు చెందిన అలేటి బ్రహ్మారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. ఆయన స్నేహితులు ఆ కుటుంబానికి రూ.72వేలను మంగళవారం వితరణ చేసి తమ స్నేహాన్ని చాటుకున్నారు. ఖమ్మంలోని ఓ కళాశాలలో డిగ్రీ స్నేహితులైన వారందరూ జమచేసి మృతుడి ఇంటి వద్ద కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో వెంకటాచారి, సుధాకర్, అచ్యుత్, సిరాజ్, శ్రీనివాసాచారి, రాజశేఖర్, కవిరాజ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ అధికారుల పొలంబాట

కూసుమంచి: మండలంలోని పాలేరు సెక్షన్ పరిధిలో మంగళవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టారు. కూసుమంచి ఏడీఈ కోక్యానాయక్ ఆధ్వర్యాన ఏఈ వెంకన్ననాయక్, సిబ్బంది రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. రైతుల విద్యుత్ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అధికారులు వస్తున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ కోరారు.

బాధ్యతల స్వీకరణ

కూసుమంచి/తిరుమలాయపాలెం: ఎంపీపీల పదవీకాలం పూర్తవడంతో ప్రభుత్వం మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించిన సంగతి తెలిసిందే. మండల ప్రత్యేకాధికారిగా జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ జి.శ్రీలతను నియమించగా.. ఆమె మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు అభినందనలు తెలిపారు. అలాగే తిరుమలాయపాలెం మండల పరిషత్ అధ్యక్ష పదవి ముగియడంతో తిరుమలాయపాలెం మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా జేడీఏ విజయనిర్మల మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిస్థితులు, సమస్యలను ఎంపీడీఓ ఎస్‌కె.సిలార్‌సాహెబ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు పారిశుద్ధ్య కార్యక్రమాల పై పలు సూచనలు చేసి, గ్రామాల్లో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీల సమస్యలు పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమాచారి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యాన ఖమ్మం జిల్లా నుంచి పలువురు బీసీ నేతలు ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్ కల్పించాలన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ పెంచాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్‌లో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రాష్ట్ర నాయకులు తేళ్ల రమేష్, వెంకట్రామయ్య, రామారావు, వెంకటకృష్ణ, నగేష్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అలుగు ఆక్రమణను తొలగించాలి

కామేపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామంలో ఉన్న నారాయణరెడ్డికుంట అలుగు పారకాన్ని ఓ వ్యక్తి ఆక్రమణ చేశాడు. దీంతో కుంట నిండి అలుగు పారే క్రమంలో పక్కనే ఉన్న పంట పొలాల్లోకి వరద నీరు చేరి తమ పంట పొలాలు నీటిలో మునిగి దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. ఇకనైనా నీటి పారుదలశాఖ అధికారులు స్పందించి వెంటనే ఆక్రమణను తొలగించాలని కోరుతున్నారు.

స్తంభాద్రి గుట్టపై వనమహోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం(గుట్ట)లో మంగళవారం వజ్రోత్సవ వనమహోత్సవ కార్యక్రమాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పలు రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సూపరింటెండెంట్ ఎం.వీరస్వామి, కార్యనిర్వాహణాధికారులు కొత్తూరు జగన్మోహన్‌రావు, వీవీ నర్సింహారావు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి హేయమైన చర్య

ఖమ్మం మామిళ్లగూడెం: హైదరాబాద్ షాద్‌నగర్‌లో దళిత మహిళను విచక్షణారహితంగా దాడి చేయడం హేయమైన చర్య అని, ఈ ఘటనకు పాల్పడిన పోలీస్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సదరు మహిళ, ఆమె కుటుంబసభ్యులను రాత్రి సమయాన ఎలాంటి విచారణ చేయకుండా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనపై విచారణకు చర్యలకు ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్‌శాఖను అప్రమత్తం చేసి, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

'ముస్లింల అణచివేతకు కేంద్రం కుట్ర'

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలో భాగంగా ముస్లిం మైనార్టీలను అణచివేసేందుకు కుట్ర పన్నుతోందని, దానిలో భాగంగానే వక్ఫ్ చట్టాన్ని అనేక మార్పులతో తీసుకొస్తుందని ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మొహమ్మద్ సలాం అన్నారు. మంగళవారం నగరంలోని లెనిన్‌నగర్‌లో చానా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో సాయుధ బలగాలు, రైల్వే ఆస్తులు తర్వాత సుమారు 9 లక్షల ఎకరాలున్న మూడో అతిపెద్ద భూ యజమాని వక్ఫ్‌బోర్డు అని, దాన్ని కాజేందుకు సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడుతున్నారన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు ఎండీ రెహమాన్, ఖాసీం పాషా, కరీం తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం..

తిరుమలాయపాలెం: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని ప్రతి ఒక్కరూ తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించాలని ఐసీడీఎస్ సీడీపీఓ సరస్వతి అన్నారు. మంగళవారం మండలంలోని కొక్కిరేణిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం ద్వారా వ్యాధి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు కొంత టైం పిల్లలకు కేటాయించి పిల్లల సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించి చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ ఉదయ్‌శ్రీ, సూపర్‌వైజర్లు సువర్చల, రమా, ఏఎన్ఎం విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


కొక్కిరేణిలో అన్నప్రాసన నిర్వహిస్తున్న దృశ్యం